
# శైశవ భావం



సాయంత్రం నీరెండలో వింతగా మెరుస్తూ, వీచే చిరు గాలికి మెల్లగా తలలాడిస్తున్న బంగాళాబంతి మొక్కల వైపు పారవశ్యంగా చూస్తూ, ఆప్యాయంగా నీళ్ళుపోస్తున్న ఆరేళ్ళ శైలూషికళ్ళు ఆనందంతో విస్ఫారితమయ్యాయి.

"అమ్మా మన పొట్టి బంతిమొక్క కూడా మొగ్గేసింది" అంటూ పరిగెత్తుకెళ్ళి చెప్పింది వాళ్ళమ్మకు. ఆ పిల్ల పెంచే అయిదు మొక్కల్లో పొట్టిది ఆలస్యంగా తొలి సారి మొగ్గ తొడిగింది. అదీ ఆనందానికి కారణం.

"అలాగా! సరే కాన్వెంట్ డ్రస్ తీసి స్నానానికి రా. తమ్ముణ్ణి కూడా రమ్మను."

అవేం వినిపించుకోకుండా వెళ్ళి ఆ మొక్కలనే తనివితీరా చూస్తూ కూర్చుంది. మొక్కలంటే ప్రాణం శైలూషికి.

"తమ్ముడు వచ్చాడు. నువ్వు స్నానానికి రా" అంటూ తొట్టివైపు తీసుకెళ్ళింది వాళ్ళమ్మ.

"అయితే నాకే ముందు స్నానం చేయించాలి" అంటూ అయిష్టంగా వెళ్ళింది. త్వరగా వచ్చి మొక్కలను చూస్తూ ఆడుకోవాలని ఆ పిల్ల అభిలాష.

"ఆగు! తమ్ముడు ముందు వచ్చాడుగా-వాడికి పోసెయ్యనీ."

"ఊహూ! నాకే ముందు పొయ్యాలి" అంది గట్టిగా. ఇంతలో నాకే ముందంటూ తమ్ముడూ మారాం చేయసాగాడు.

వాళ్ళమ్మ తమ్ముడికే ముందు పోసింది. దాంతో స్నానం చెయ్యనంటూ మూతి ముడుచుకుని ప్రక్కకు వెళ్ళింది.

"నాకింకా పనులున్నాయి. త్వరగా వస్తావా రావా" విసుగ్గా అంది వాళ్ళమ్మ. తమ్ముడు గర్వంగా అక్క వైపు చూసి టవలు చుట్టుకుని వెళ్ళిపోయాడు. దాంతో ఉక్రోషంగా "ఏం? వాడికెందుకు ముందు పొయ్యాలి? నేనంటే నీకసలిష్టముండదు" అంది కోపంగా. వాళ్ళమ్మ చెయ్యి పట్టుకుని లాక్కొచ్చి స్నానం చేయించింది.

శైలూషి మనసునిండా దిగులునిండింది. అలిగి తర్వాత పాలూ, బిస్కట్లు తినలేదు. తమ్ముడు తింటూ వెక్కిరిస్తూంటే తోసింది. వాడు వెనక్కి పడి ఏడుస్తూంటే వాళ్ళమ్మ వచ్చి శైలూని కసిరి రెండంటించింది.

నీళ్ళు చిప్పిల్లిన కళ్ళతో అక్కడ్నుంచి వేగంగా లేచి వెళ్ళింది శైలూ. గేటులో ఆఫీసు నుంచి వస్తున్న నాన్నను చూసి ఎదురెళ్ళి చుట్టేసుకుని బావురుమంది.

"అయ్యో! ఏమయిందమ్మా" అంటూ ఎత్తుకున్నాడు నాన్న.

అమ్మ కొట్టిందని ముందు చెప్పాలా, పొట్టి బంతి కూడా పూసిందని చెప్పాలా అని మనసులోనే తర్కించుకుంది కాసేపు. "మరే అమ్మ...అమ్మ...ఊహూ... మన పొట్టి బంతి కూడా మొగ్గేసింది" అంది.

"మరేడుస్తావెందుకూ?"

"అమ్మ కొట్టింది. అమ్మకు తమ్ముడంటేనే ఇష్టం. నేనంటే అస్సలిష్టముండదు" అంది వెక్కుతూ.

"అయ్యో! అమ్మను నేను తిడ్తా కానీ ఏడుపాపేసి ఇక్కడాడుకో" అని మొక్కలదగ్గర దింపి లోపికెళ్ళాడు.

తర్వాత సాయంత్రమంతా వాళ్ళమ్మతో మాట్లాడకుండా నాన్నతోనే కబుర్లు చెప్పింది. చీకట్లు కమ్మాయి.

"శైలూ భోజనానికి రామ్మా" అంటూ వాళ్ళమ్మ వస్తే "నేను రాను, నాకేం వద్దు, అన్నీ తమ్ముడికే పెట్టు" అంది.

శైశవంలో మొలకెత్తే భావాలు మనసులో బలంగా ముద్రవేస్తాయి.

"తప్పమ్మా, అలా అనకూడదు. అమ్మకు ఎవరంటేను ఎక్కువిష్టం లేదు. ఇద్దరూ సమానమే" అన్నాడు వాళ్ళ నాన్న.

"ఏం కాదు తమ్ముడంటేనే ఎక్కువిష్టం."

"సరే శైలూ! నీకు నీ బంతి మొక్కలయిదింటిలో ఏదంటే ఎక్కువిష్టం" అడిగాడాయన.

బంతి మొక్కల ప్రసక్తి వచ్చేసరికి ప్రసన్నంగా మారి "ఊ...నా కన్నీ ఇష్టమే" అంది.

"ఏం? పొట్టి బంతి పూయలేదనీ మిగతావి ముందే పూసాయనీ తేడా లేదా."

"ఊహూ... ఇదెప్పుడు పూస్తుందా అని దీనిపై ఇష్టం. అవి పూసేసాయని అవంటే ఇష్టం" అంది వింతగా కళ్ళు తిప్పుతూ.

"నువ్వు అమ్మలా చూసుకుంటున్న నీ మొక్కలన్నీ నీ కెలా సమానమో అమ్మకు అలా మీ ఇద్దరూ సమానమే. అలా అనుకోవడం తప్పమ్మా. వెళ్ళి అన్నం తిను" అని మృదువుగా చెప్పాడు.

ఆ చిన్న మనసుకు అర్థమయినట్టు కళ్ళలో ఏదో మెరుపు. మౌనంగా లేచి వెళ్ళి అమ్మ పెట్టిన ముద్దను అందుకుంది.

—వెల్లంకి అన్నప్రసాద్

# సుభాషితాలు

కోపం చాలా ఖరీదైన విలాస వస్తువు. డబ్బు ఉన్నవాళ్ళే దాని కోసం ఖర్చు పెట్టగలరు.

- జార్జి విలియమ్ క్యూరిటిస్

రాజకీయ నాయకుడు గాలికోడి లాంటివాడు. గాలి ఎటు వీస్తోందో బాగా తెలుసుకోగలడు.

* * *

నీ సమస్య పరిష్కారానికి బుర్ర ఉపయోగించు. ఇతరుల సమస్యల పరిష్కారానికి నీ హృదయం ఉపయోగించు.

- ఐజాక్ బాస్ హెవిస్ సింగర్

నిన్ను గురించి ప్రజలకి తెలియదని బాధపడకు. నిన్ను గురించి తెలుసుకోవడానికి ఏమీ లేదేమో ఆలోచించు.

- కన్‌ఫ్యూషియస్

ఓపికలేని మనిషి నూనెలేని దీపంతో సమానం.

- మేరీ బేకర్ ఎడ్డీ

— సేకరణ: కె. రామారావు, హైదరాబాద్- 27

మంచి అభిప్రాయాలు, ఆలోచనలు వుండగానే సరిపోదు. వాటిని తు.చ తప్పక ఆచరణలో పెట్టాలి.

- బేకన్

వేదాంతిలాగ మాట్లాడటం, వ్రాయటం మనుషులకు తేలిక. కాని తెలివిగా వ్యవహరించవలసి వచ్చినప్పుడే వారికి ఇబ్బంది.

- రివరోల్

అదృష్టం మానవుల్లో మార్పు తీసుకురాదు. వారి అసలు రంగులు వెలికి తెస్తుంది.

- రికోబోనీ

మూర్ఖుల మంచి ప్రశంసలు పొందటం కన్నా బుద్ధిమంతులచే తిట్లు తినటం మిన్న.

- షేక్స్‌పియర్

ఎదుటివారి ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కించపరచనంత కాలం నీవు మంచి వాడవే!

- బ్రూరే

రాజకీయ నీచుడికి కులతత్వమే మొదటి తరుణోపాయం.

- జేమ్స్ బాస్‌వెల్

—సేకరణ: పి.శాంతి, విజయవాడ